



మాట్లాడుతున్న బీసీ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు

అందరూ కలిసి రేపటి బీసీ బంద్‌కు సహకరించాలి

» బీసీ రిజర్వేషన్ పోరాట సమితి ఉట్నూర్ కన్వీనర్ సీపతి లింగాగౌడ్

ఉట్నూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిసి రేపు నిర్వహించనున్న బీసీ బంద్‌కు సహకరించాలని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి ఉట్నూర్ కన్వీనర్ సీపతి లింగాగౌడ్ కోరారు. మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్ ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిందని, కానీ దొడ్డిదారిన రెడ్డివర్గీయులే బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధించేవరకు ఉద్యమిస్తామని, అందులో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం బంద్‌కు ప్రతీఒక్కరు సహకరించాలని, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు బందులో పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల తర్వాత బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన మరుక్షణమే అదే అగ్రవర్ణాలకు చెందిన రెడ్డి సామాజికవర్గ నేతలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారన్నారు. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లయినా అగ్రవర్ణాలకు రాజ్యాధికారంపై ఇంకా ఆశ తీరలేదని విమర్శించారు. 60శాతం ఉన్న బీసీలను పిడికెడు శాతం ఉన్న అగ్రవర్ణాలు విభజిస్తూ పరిపాలిస్తున్నారన్నారు. బీసీలంతా ఐక్యం కావాలని రిజర్వేషన్లను అడ్డుకుంటున్న వారికి గుణపాఠం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు సైతం బీసీలకు అండగా మద్దతు పలికినందున, అధికార పార్టీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు బీసీల రిజర్వేషన్ పోరాట సమితితో కలిసి రావాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో ఉట్నూర్ మండల బీసీ సంఘాల నాయకులు ఘర్షకుర్తి వెంకటేష్, బింగి వెంకటేష్, కందుకూరి రమేష్, సల్గారే రవీందర్, కాల్వరవి, కొండేరిరమేష్, ధరణి రాజేశ్, కట్ట లక్ష్మణచారి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గంజాయి దహనం చేస్తున్న దృశ్యం

గంజాయి నిర్మూలనే లక్ష్యం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం కృషి చేస్తోందని ఏఎస్పీ సురేందర్ రావు తెలిపారు. గురువారం గంజాయి కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో 18 కేసుల్లో పట్టుబడిన 41 కిలోల 918 గ్రాముల గంజాయిని నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద శ్రీమెడికేర్ సర్వీసెస్ సెంటర్ వద్ద దహనం చేశారు. ఇందులో 21.057 కిలోల గంజాయి మొక్కలు, 20.861 కిలోల ఎండు గంజాయి ఉన్నట్టు ఏఎస్పీ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయిని దహనం చేసినట్లు వెల్లడించారు.

ఇన్‌చార్జి డీపీఆర్‌వోగా విష్ణువర్ధన్ బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఇన్‌చార్జి జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఎల్చల విష్ణువర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పౌర సంబంధాల విభాగం పని తీరు మరింత ప్రభావవంతంగా ఉండేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న విష్ణువర్ధన్

రిజర్వేషన్లపై సందిగ్ధం

స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై మళ్లీ సందిగ్ధ పరిస్థితులు నెలకొంటున్నాయి. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం పిటిషన్ కొట్టివేస్తూ పాతపద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొనడంతో ఆశావహ నేతల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. ఎన్నికల మాట దేవుడెరుగాని ఇదివరకు ఖరారైన రిజర్వేషన్లు ఉంటాయా? లేక మారుతాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



» సుప్రీం కోర్టు తీర్పుతో డైలామాలో స్థానిక సంస్థల ఎన్నికలు
» రిజర్వేషన్ కలిసి వచ్చిన వర్గాల్లో ఆందోళన
» పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే మార్పునకు చాన్స్
» షెడ్యూల్ విడుదల కావడంతో భారీగా ఖర్చు చేసిన నేతలు
» రాష్ట్ర సర్కారు నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ

ఆదిలాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమైన విష యం తెలిసిందే. జిల్లాలో 473 పంచాయతీలు, 20 జడ్పీటీసీ స్థానాలు, 166 ఎంపీటీసీ స్థానాలు, 3,870 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అలాగే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడం ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్‌ను కూడా జారీ చేయడంతో స్థానిక ఎన్నికలు జరుగడం ఖాయమని అందరూ భావించారు. కానీ ఊహించని విధంగా హైకోర్టు స్థానికఎన్నికలపై స్టే విధించడంతో అందరి అంచనాలు తారుమారయ్యాయి. రాష్ట్ర సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం పిటిషన్ కొట్టివేస్తూ పాతపద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొనడంతో నేతల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేగాని ఖచ్చితంగా చెప్పలేమంటూ అధికారులు పేర్కొనడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకున్న ఆశావహ నేతలు అయోమయానికి గురవుతున్నారు.

రిజర్వేషన్ల పై మళ్లీ ఉత్కంఠ

స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు కలిసి వచ్చిన వర్గాల్లో కొంత ఆనందం వ్యక్తమైన అంతలోనే ఆవిరై పోయింది. షెడ్యూలు విడుదల కావడంతో ఎన్నికల కు సిద్ధమైన ఆశావహ నేతలకు హైకోర్టు షాక్ ఇచ్చింది. తిరిగి ఎన్నికలను నిర్వహిస్తే రిజర్వేషన్లు మళ్లీ కలిసి వస్తాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్ల పై గ్రామాల్లో వివిధ రకరకాల ప్రచారం జరుగడంతో ఆశావాహ నేతలు అయోమయానికి గురవుతున్నారు. ఏ నలుగురు (మిగతా 4వ పేజీలో)

భిన్నమైన వాదనలు

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాతపద్ధతిలోనే స్థానిక ఎన్నికలను నిర్వహిస్తే రిజర్వేషన్ల మార్పుకు అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. చట్టబద్ధత లేని 42శాతం రిజర్వేషన్ల అమలుకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. బీసీ, జనరల్ స్థానాలు మారిన ఎస్సీ, ఎస్టీ స్థానాలు మారే అవకాశం ఉండదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పాతపద్ధతి ప్రకారం బీసీ స్థానాలు భారీగా తగ్గి జనరల్ స్థానాలు పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని 20 జడ్పీటీసీ స్థానాల్లో 8 బీసీ, 8 ఎస్టీ, 2 ఎస్సీ 2 జనరల్ స్థానాలుగా కేటాయించారు. పాత పద్ధతి ప్రకారం మళ్లీ రిజర్వేషన్లను ఖరారు చేస్తే ఈ స్థానాల్లో మార్పులు చేర్పులు ఉండే అవకాశం లేక పోలేదంటున్నారు.



రుయ్యాడీలో ఎద్దుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి లావణ్య

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

తలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుయ్యాడీ గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య మాట్లాడారు. పశువులు రాకుండా ఉండాలంటే టీకాలు వేయించాలని సూచించారు. పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేయించుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపడుతున్నన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అనంతరం పశువులకు గాలి కుంటు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు లోక ప్రవీణ్‌రెడ్డి, రైతులు గణపత్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది, గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకా రక్ష

నేరడిగొండ: జీవాలకు టీకా రక్షణగా పనిచేస్తుందని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గురువారం మండలంలోని ఇస్పూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తోందని. దీంట్లో భాగంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ఏటా చలికాలంలో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటున్నందున పశుసంవర్ధక శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని, పశువులకు టీకాలు వేయించాలని వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. ఇందులో వైద్య సిబ్బంది, రైతులు ఉన్నారు.



ఇస్పూర్‌లో పశువుకు టీకా వేస్తున్న రాథోడ్ జీవన్



విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై దృష్టి

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవెలెబుల్ స్కూళ్ల యాజమాన్యాల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. ఇటీవల బెస్ట్ అవెలెబుల్ స్కూళ్లలో పిల్లలను రానివ్వడం లేదని తల్లిదండ్రులు నిరసన తెలిపి కలెక్టర్ కు వినతిపత్రం అందించిన గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బెస్ట్ అవెలెబుల్ స్కూళ్లను సందర్శించారు. యాజమన్యంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం యత్నిస్తుందని విద్యార్థుల చదువును ఆపొద్దని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ బెస్ట్ అవెలెబుల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రభుత్వం కూడా పాఠశాలల యాజమన్య సమస్యలను గుర్తిస్తుందన్నారు. పిల్లల భవిష్యత్తుకై సహకరించాలని యజమాన్యాలకు సూచించారు జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ కమ్యూనిటీ సునీత, ఎంఈఓ సోమయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నేరడిగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలోని బోరిగాం గ్రామపంచాయతీ పరిధిలోని సేవదాస్‌నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షాలకు కోతకు గురి కాగా ప్రయాణికులు ఇబ్బందు పడుతున్నారు. ఈ దీన్ని గమనించిన స్థానిక నాయకుడు రాథోడ్ వినేష్ సొంత ఖర్చుతో జేసీబీ సహాయంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సమస్యను పరిష్కరించిన వినేష్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన

ఉట్నూర్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చినప్పుడు అత్యవర సమయంలో ప్రాణరక్షణ పద్ధతులు (సీపీఆర్) పాటిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని మండలకేంద్రంలోని 108 సిబ్బంది ప్రయాణికులకు, ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. గురువారం మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఉట్నూర్ 108 అంబులెన్స్ సిబ్బంది మాట్లాడారు. సీపీఆర్ పద్ధతి ద్వారా మనిషి ప్రాణాలు కాపాడవచ్చని అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కుంభోజి దత్తాత్రేయ అన్నారు. ఈ సీపీఆర్‌పై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విధానం అత్యవసర సమయంలో చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది కుంభోజి దత్తాత్రేయ, గణేష్ మరియు పైలెట్స్ మార్కపు రవీందర్, బస్సీ సుందర్‌సింగ్‌లతో పాటు ఉట్నూర్ ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ శకుంతల రాజన్న, ఆర్టీసీ ఉద్యోగులు, కంట్రోలర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.



ఉట్నూర్ బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం

» భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు

• వివరాలు 5లో





రేళ్లపల్లి గ్రామంలో నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

ఆదివాసీ గూడలో గుస్సాడీ సంబరాలు

బోథ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గూడెలలో గుస్సాడీ సంబరాలు ప్రారంభమయ్యాయి. 2రోజుల నుంచి గిరిజన గూడాలో గుస్సాడీ సంబరాలు ఘనంగా జరుపుకుంటున్నారు. పలు గ్రామాల్లో అతిత్యం కోసం వచ్చిన గుస్సాడీలతో సంబరాలు సాగుతున్నాయి.

చూడముచ్చటైన గుస్సాడీ వేషధారణ

గుస్సాడీ వేషధారణ ఆకట్టుకుంటోంది. తలపై నెమలి ఈకల టోపీ, శరీరమంతా బూడిద, ఓ చేతిలో జుడ్డుకర్ర.. మరో చేతిలో జంతు చర్మం నడుముకు గజ్జె, తాడుకాళ్లకు చిన్న గజ్జలు కట్టుకొని నృత్యాలు చేస్తున్నారు. ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు మోగిస్తుండగా వాయిద్యాలను అనుకరిస్తూ నృత్యాలు చేస్తున్నారు.

పొలం పనులు మాని సంబరాల్లో..

వారంరోజుల పాటు ఆదివాసీలు తమ పొలం పనులకు స్వస్తి పలికి గుస్సాడీలకు స్వాగతం పలుకుతు వారి నృత్యాలను తిలకిస్తున్నారు. వారం రోజులపాటు పిల్లాపాపలతో గుస్సాడీ నృత్యాలు చేసే చోట కూర్చుండి ఆనంద పడుతున్నారు. ఏ గూడెంలో చూసినా గజ్జల సవ్వడి, డప్పు వాయిద్యాలు వినిపిస్తున్నాయి.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

» రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షులు పంద్రంశంకర్

బోథ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుస్సాడీలను మాహూర్ తీసుకువెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుండెపోటుకు గురై మృతి చెందిన వాహన డ్రైవర్ పోశెట్టి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పంద్రంశంకర్ అన్నారు. గురువారం మృతుడి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. తాము అన్ని విధాలుగా సహకరిస్తామని ఆందోళన చెందవద్దని అన్నారు. పోశెట్టి కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షులడు రామెల్లి భోజన్న, డివిజన్ అధ్యక్షుడు డి.విశ్వేశ్వరరావు, న్యాయవాది ఆడెపు హరీష్, మాజీ ఎంపీపీ అక్కకిషన్ బోథ్ సేవా సమితి అధ్యక్షులుగో పాల్‌కుర్మ, రాజన్న, డి.రమేష్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు దేవేందర్, చందు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

» కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ అవరమొచ్చినా తాను అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారం కోసమే ప్రతీవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన క్యాంపు యాల్లోయం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌కు ఆయన హాజరయ్యారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాదర్బార్‌లో తమ సమస్యలు, గ్రామ సమస్యలు, వార్డు, కాలనీల సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రజాదర్బార్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్లికేషన్‌ల డాటాను ఎప్పటికప్పుడు భద్రపరిచి ఆప్‌డేట్ తెలుసుకునే అవకాశముందన్నారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం శాయ శక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దిగంబర్ రావు పాటిల్, గిమ్మ సంతోష్, కొండ గంగాధర్, సంద నర్సింగ్, రాంకుమార్, దర్శనాల లక్ష్మణ్,ఏఎస్,ఫైజుల్లా ఖాన్, అల్చెట్టి నాగన్న పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షి షా



హాజరైన అధికారులు, రైతు సంఘం నేతలు

పత్తి కొనుగోళ్లు సక్రమంగా సాగేలా చర్యలు

» కలెక్టర్ రాజార్షి షా
» జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లు సక్రమంగా సాగేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్‌జాదవ్, డీసీసీబీ, గ్రంథాలయ సంస్థల చైర్మన్‌లు అడ్డి భోజారెడ్డి, మల్లేపూల నర్సయ్య, రై తు సంఘం నాయకులు, జిన్నింగ్ యాజమానులు, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు హాజరయ్యారు. కిసాన్ కపస్ యాప్‌తో ఎదురయ్యే ఇబ్బందులను రైతు సంఘ ం నేతలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్ యార్డుల్లో తగిన వసతులు కల్పించాలన్నారు. మద్దతు ధర 8వేల 110 ఉన్నందున తాము కొనుగోళు చేయలేమని, తాము సీసీఐకి పూర్తిగా మద్దతుగా ఉంటాయని ప్రైవేట్ జిన్నింగ్ వ్యాపారాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ సీసీఐ ద్వారా 11 కేంద్రాలు, 33 జిన్నింగుల్లో కొనుగోళ్లు జరుగుతాయన్నారు. రైతులు పత్తిని విక్రయించే ముందు కిసాన్ కపస్ యాప్ లో వివరాలు నమోదు చేసి స్లాట్ తీసుకోవాలన్నారు. పించన్ సమస్యను పరిష్కరించిన మాదిరిగానే నెట్వర్క్, టవర్ లెని సమస్యను అధిగమిస్తామన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు సైతం సేకరించామని, చదువు రాని రైతుల కోసం గ్రామంలో చదువుకున్న, ఆన్‌లోడ్ మొబైల్ వినియోగించే యువకులకు యాప్ పై శిక్షణ ఇప్పించి వాలంటరీగా వారి సేవలను వినియోగిస్తామన్నారు. అదే విధంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా లోకల్ మానిటరింగ్ కమిటీ కూడా ఉంటుందన్నారు. గతంలోని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ స్రవంతి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్, సీసీఐ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులకు దరఖాస్తును అందిస్తున్న దృశ్యం

మద్యం దుకాణాలకు జోరుగా దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 40 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. టెండర్ల స్వీకరణ ప్రారంభంలో కొంత మందకొడిగానే దరఖాస్తులు రాగా.. గడువు తేదీ దగ్గర పడుతున్నకొద్దీ ఔత్సాహికులు దరఖాస్తుల సమర్పణకు ముందుకు వస్తున్నారు. గురువారం నాటికి మొత్తం 170 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

గుండాలలో కలప పట్టివేత

ఇచ్చోడ, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామసమీపంలో గల అటవీ ప్రాంతంలో రూ.90వేల విలువగల 9టేకు దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎఫ్ ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా అటవీ అధికారి రేవంత్‌చంద్ ఐఎఫ్ ఎస్ ఆదేశాల మేరకు పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, సిరిచెల్మ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా అడవిలో కలప నరికి సైజులుగా మార్చేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 9 కలప దుంగలను ఇచ్చోడలోని డిపోకి తరలించి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అమర్‌సింగ్, కవి త, ఎఫ్‌బీఓలు సజన్‌లాల్, భీంజినాయక్, రాకేష్, స్వాతి, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత

బోథ్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీని గురువారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఘన్పూర్ చెక్ పోస్టువద్ద పోలీసులు మాటువేసి ఉండగా నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ చెక్‌పోస్టు వద్దకు చేరుకుంది. వెంటనే లారీని ఆపి తనిఖీ చేయగా అందులో 27 ఏడ్లు ఉన్నాయి. అందులో నుంచి రెండు ఎడ్లు చనిపోగా మరికొన్ని ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో పోలీసులు సంబంధిత వెటర్నరి అసిస్టెంట్‌కు సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. పట్టుబడిన ఎడ్లను బజార్‌హత్నూర్‌లోని గోశాలకు తరలించారు. నాగాపూర్ నుంచి మంగళవారం రాత్రి వెళ్లినట్లు పట్టుబడినవారు పేర్కొన్నారు. దీంతో లారీలు పట్టుబడిన కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్మశాన వాటికలో వసతుల కల్పనకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న దృశ్యం

బోథ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశాన వాటిక వసతులను గురువారం స్థానిక ఎంపీడీఓ ఎల్.రమేష్ పీఓపీ అంజయ్యలు కలిసి పరిశీలించారు. శ్మశాన వాటిక బురదమయం కావడంతో దహన సంస్కరణలు చేయడం కష్టంగా మారిందనే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. శ్మశాన వాటికలోకి వృథానీరు రాకుండా మూడుపీట్ల ఎత్తుతో ప్రహరీ నిర్మించడంతోపాటు స్నానాలకు వసతులు కల్పించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ సౌకర్యంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా మొక్కలను పెంచుతామని నిర్ణయించుకున్నారు. త్వరలోనే స్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ ఈఓ వివరించారు.

విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు

ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వివిధ ధృవీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కార్యాలయల చుట్టూ తిరగకుండా వారికి అవసరమైన ఆధార్, రెసిడెన్స్ సర్టిఫికెట్ ఒకేచోట దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. గురువారం గజిటెడ్ నంబర్ 1 పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్, ఎంబీయూ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆధార్ నమోదు, మార్పులు, మీసేవా ద్వారా అందించే సర్టిఫికెట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ ఐడీ కోసం ఆధార్ తప్పని అని అన్నారు. ఆధార్‌లో మార్పులు, కొత్తగా తీసుకోవడానికి మీసేవ, ఆధార్ కేంద్రం, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని ఓకేచోట ఉండేలా ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్‌అర్బన్, రూరల్, మావలమండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. కొత్త ఆధార్ కోసం రుసుము ఉండదని, మార్పులు మీసేవా ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రుసుము ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఈడీఎం బండి రవి, సెక్టోరియల్ అధికారి రఘునరమణ, ఎంఈఓ సోమయ్య, పాఠశాల హెచ్‌ఎం నీలా దేవి పాల్గొన్నారు.



ఆధార్, ఎంబీయూ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

తలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడవద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కోరారు. గురువారం మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన అనక విలాస్ డయాలసిస్ సమస్యతో ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శ్రీకృష్ణా ఆసుపత్రిలో చేరగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆసుపత్రిని సందర్శించి విలాస్ ఆరోగ్యపరిస్థితి క్రాంతిని అడిగి తెలుసుకున్నారు. విలాస్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీఇచ్చారు. ఆయనవెంట మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ వెంకటేష్, జరి పీఏసీఎ చైర్మన్ వెల్మ, శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు ముడుపు కేదారేశ్వర రెడ్డి, రమాకాంత్, చందు, రవికాంత్ యాదవ్, తిరుమల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాలి సంఘం జెండా పండుగ

తలమడుగు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండలం బరంపూర్ గ్రామంలోని బస్టాండ్ వద్ద గల కూడలిలో మాలి సంఘం జెండా పండుగను మాలి (బారె) కులస్తులు, గ్రామస్థులు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిబాపూలే, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన పిదప మాలీ సంఘ ఉద్యమ పతాకాన్ని బరంపూర్ గ్రామ అధ్యక్షుడు బెల్లపు వినోద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాలి కులస్తులు మహాత్మా జ్యోతిబాపూలే దంపతుల ఆశయ సాధన కోసం కృషి చేస్తూనే మాలిల హక్కుల కోసం పోరాడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మాలిలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెల్లపు విలాస్, మొహూర్లే భీమ్రావు, బెల్లపు మారుతి,మాలీ కులస్తులు, గ్రామస్తులు పాల్గొని పూలే దంపతులకు నివాళులర్పించి జయ్ జ్యోతి, జయ్ క్రాంతి నినాదాలతో హోరెత్తించారు.



తలమడుగులో పోషణ మాసంలో పాల్గొన్న సూపర్‌వైజర్



వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

» ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ

తలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. మండలకేంద్రంలో గురువారం పోషణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు, ఆడపిల్లలు, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. ఇందులో మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణ మంజుల పద్మ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసు కోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పర్వా అన్నారు. శాంతినగర్ అంగన్ వాడీ కేంద్రంలో గురువారం పోషన్‌మాసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారాలపై అవగాహన కల్పించేలా ప్రదర్శన ఇచ్చారు. అనంతరం పలువురిని సత్కరించారు. ఇందు లో భాగంగా బతుకమ్మలతో కాలనీలో ర్యాలీ ని ర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్ కవిత, వినోద, ఆశాలు ప్రమీల, హరిక ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

బోథ్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై సందిగ్ధం

(3వ పేజీ తరువాయి)

కలిసిన రిజర్వేషన్ల పైననే మాట్లాడుకోవడం కన్పిస్తోంది. ప్రస్తుతం ఆశావహ నేతలంతా అధికారులకు ఫోన్లు చేస్తూ మరి రిజర్వేషన్లపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు రిజర్వేషన్లపై ఇప్పుడే ఏమి చెప్పలేని పరిస్థితి ఉందంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో ఆశావాహ నేతలంతా డైలామాలో పడుతున్నారు.

ఎన్నికల జోష్‌లో జేబులు ఖాళీ

స్థానిక ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికలు జరుగడం ఖాయమని భావించిన నేతలంతా ఓటర్ల మద్దతు కోసం ముమ్మర ప్రయత్నాలు చేశారు.ఈ క్రమంలోనే మందు, విందు పార్టీలను సైతం నిర్వహించారు. ప్రధానంగా దసరా పండుగ రోజు ముఖ్య అనుచరులకు ప్రత్యేకంగా దావతులను ఏర్పాటు చేశారు. అప్పు చేసి ఎన్నికలకు అవసరమైన నిధులను సమకూర్చున్నారు. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నో హామీలు కూడా ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి నుంచి రిజర్వేషన్లపై అనుమానాలే వ్యక్తమైన చివరికి అనుకున్న విధంగానే ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో తొందర పడి రూ.లక్షలు ఖర్చు చేశామంటూ నేతలు తలలు బాదుకుంటున్నారు. మళ్లీ రిజర్వేషన్ కలిసి వస్తుందో రాదోనన్న ఆలోచనలోపడ్డారు.

వసతిగృహ నిర్మాణానికి స్థల పరిశీలన

బజార్‌హత్నూర్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ భవనం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో పక్కా భవన నిర్మాణం కోసం మండల అధికారులు సోషల్ వెల్ఫేర్ డీడీ సునీతతో కలిసి గురువారం పలుచోట్ల స్థల పరిశీలన చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని తీధి గుంటల కాళీ ప్రదేశంతో పాటు అదనపు గదులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆవరణలోని బీసీ వసతి గృహంలోని ఖాళీగా ఉన్న గదులను పరిశీలించారు. అద్దెభవనంలో అసౌకర్యాల కంటే వసతులు కలిగిన భవనంలో తాత్కాలిక వసతిపై చర్చించారు. వారితో మండల ప్రత్యేక అధికారి మోహన్, తాహసిల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో శ్రీనివాస్, సోషల్‌వెల్ఫేర్ వసతిగృహ వార్డెన్ చైతన్య ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయి. గురువారం పట్టణం నుంచి మహిళా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్‌కు చెందిన తన్నీరు నవత తోపాటు బీఆర్‌ఎస్ నుంచి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు గొడ్డండ్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అంతా కలసి ముందుకు సాగుతామని అన్నారు. కార్యక్రమంలో తాలూక పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, బూర్ల శంకరయ్య,మోర ఆశన్న, దాసరి ఆశన్న, ఎంఏ షకీల్, శ్రవణ్ నాయక్,దర్శనాల లక్ష్మణ్, అజయ్, దత్తు, మదర్ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

రిజర్వేషన్లపై ఐక్య పోరాటం

● రేపటి రాష్ట్ర బంద్‌ను విజయవతం చేయాలని తీర్మానం



బాసర సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు

బాసర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతులు (బీసీ) హక్కుల సాధనలో భాగంగా శనివారం తలపెట్టిన రాష్ట్రబంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాసర మండల బీసీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఉమ్మడిగా పోరాడాలని సంకల్పాన్ని ప్రకటించారు. రాష్ట్రబంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాడానికి చేపట్టాల్సిన కార్యాచరణ, వ్యూహాలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ సంఘాట నాయకులు, వివిధ ఉపకులాల సంఘాల ప్రముఖులు హాజరై తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

విద్యార్థుల హాజరు పెంపు కోసం అధ్యాపకుల తంటాలు

భైంసా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు తగ్గిపోతున్న విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు గాను భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం గురువారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కళాశాల ప్రిన్సిపల్ శివరంజని నేతృత్వంలో అధ్యాపకులు హరిప్రసాద్, రజనీకాంత్, సంతోష్, గంగయ్య, చందులు బృందంగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే కళాశాలకు సక్రమంగా రాకుండా గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించే చర్యలు చేపట్టారు. గురువారం అధ్యాపక బృందం కళాశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల జాబితాను రూపొందించారు. సంబంధిత జాబితాకు అనుగుణంగా అధ్యాపక బృందం గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇంటి వద్దకు స్వయంగా వెళ్లారు. అక్కడ విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులకు హజరు విషయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. క్రమం తప్పకుండా కళాశాలకు రాకపోవడం మూలంగా విద్యార్థులకు జరిగే నష్టాలను వివరించారు. చదువులో వెనుకబడి పోవడానికి గైర్హాజరు ప్రధాన కారణంగా మారుతుందని విశదీకరించారు. కళాశాల రాకుండా ఇంటి వద్ద ఉంటే విలువైన సమయం వృధా అవ్వడమే కాకుండా వ్యసనాల బారిన పడే ప్రమాదం ఉందని వివరించారు. కళాశాలల్లో ఫేస్ రికగ్నిషనల్ సిస్టమ్ ద్వారా హజరు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రతి రోజు విద్యార్థి కళాశాలకు వచ్చి తరగతులకు హజరు కావాల్సిన అవశ్యకతను వివరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు హజరు అత్యంత కీలకమని అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపక బృందం నిర్వహించిన కౌన్సిలింగ్ ప్రక్రియకు స్పందించిన పలువురు విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపిస్తామని వెల్లడించారు.

బాధితులకు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే

కుభీర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బోయిడి రాజు ఎర్రన్న ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే విఠల్ రెడ్డి గురువారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాన్, నాయకులు శంకర్‌చావన్, విజయ్‌కుమార్, పైపాల్ రెడ్డి, డి. రాములు సార్, తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా చర్యలు

● జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్

ఖానాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పశువులలో గాలికుంటు వ్యాధి సోకకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్ తెలిపారు. గురువారం ఖానాపూర్ శివారులో గల గోశాలలో స్థానిక వెటర్నరీ ఏడీ రామచంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు, పశుపోషకులు తప్పకుండా వారి వారి పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ఇస్తున్నామన్నారు.

కుంటాల : రాష్ట్ర ప్రభుత్వం రైతుల యొక్క పశువులకు ఉచితంగా సరఫరా చేస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని పశువైద్యాధికారి ప్రియాంక అన్నారు. గురువారం మండలంలోని అంబకంటి, అంబకంటి తాండాలలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని ప్రభుత్వం నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

తానూర్ : మండలంలోని బోరిగాం గ్రామంలో డారాజేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం పశువులకు గాలికుం టూ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డా. బాలిగ్ హైమ్మద్ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలోని రైతులందరు తప్పకుండా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచిచంరాఉ. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ తోట అమృతం, సిబ్బంది, రైతులు ఉన్నారు.



ఖానాపూర్‌లో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

నిర్మల్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధ్యాయులలో కొంత మంది విదేశీ విద్యా విధానం ఎలా బోధన జరుగుతుందో పర్యవేక్షించడానికి వెళ్లే టీమ్‌ను పారదర్శకంగా నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట రావు జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నను కోరారు. కొంతమంది జిల్లాలోని ఉపాధ్యాయులను పర్యవేక్షణ కమిటీలలో తీసుకునే విధానంలోని నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రెండో దశ ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితాను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా వారిని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. బిక్షపతి, సూపరిండెంట్ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ల సాధన పోరాటానికి మద్దతు

ఖానాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకు బీసీ సంఘాల పోరాటానికి సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నిరంతర మద్దతు కొనసాగుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు నంది రామయ్య స్పష్టం చేశారు. గురువారం ఎన్టీఆర్‌చౌక్‌లో గల ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ సంఘాలు ఈ నెల 18వ తేదీన నిర్వహించాలని తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించకపోవడం సరికాదన్నారు. బీసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపుకు అన్ని వాణిజ్య, వర్తక సంఘాలు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జక్కుల రాజన్న, ఏ. శంకర్, సుదర్శన్, కురుమ రాజన్న, గోరేబాయ్, శ్రీనివాస్, నర్సయ్య, లచ్చన్న, రాజు, తదితరులున్నారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తి అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నిర్మల్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తామని కపట నాటకాలు ఆడుతున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అవలంబిస్తున్న విధానాలు బీసీలను మోసం చేసే విధంగా ఉన్నాయని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కే. రాజన్న అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. వెంటనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు.

హైదరాబాద్ బయలుదేరిన వీవోఏలు

కుంటాల, అక్టోబరు, 16 : (ఆంధ్రజ్యోతి) : గురువారం రోజు హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయం ముట్టడికి రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కుంటాల మండలం నుంచి వీఓఏలు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బక్కి మహేష్, కార్యదర్శి మట్ట గజ్జారాం, కోశాధికారి షేక్ అసీనా, ఉపాధ్యక్షులు జాదవ్ సంపత్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ. 20 వేలు చేయాలని, 58 జీవో రద్దు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, వీఓఏలందరికీ ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వీఓఏలకు వేతనాలు వ్యక్తిగత ఖాతాకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

టీఎస్‌టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు

తానూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం టీఎస్‌టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాల తనిఖీల కోసం ఉపాధ్యాయులతోతనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, వీరి స్థానంలో ఎంఈవోలను, డిప్యూటీ ఈవోలను, డీఈవోలను శాశ్వత ప్రాతిపాదికన నియమించాలని కోరారు. టీఎస్ టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పుట్ట రవికిరణ్, పైడిపల్లి భోజన్న, షేక్‌ఫాజిల్, నవీన్‌కుమార్ రవి, చందుల వీరేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ముథోల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయ ఆవరణలో గురువారం ఆరాధన ఆయుర్వేద వెల్నెస్ రీసెర్చ్ సెంటర్ (భైంసా) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యురాలు డా. జూలీ (కేరళ) మాట్లాడుతూ.... దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద మందులు, యోగా, నేచురోపతి పద్ధతుల్లో ఉపశమనం పొందవచ్చు అన్నారు. వైద్య శిబిరంలో దాదాపు 100 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వేదాంత్ పాటిల్, బీడీసీ అధ్యక్షుడు వరగంటి విఠల్, మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ళ రమేష్, బీడీసీ ఉపాధ్యక్షుడు పల్లె నాగేష్, కోశాధికారి జిందంవార్ వెంకటేష్, ఆసుపత్రి పర్యవేక్షకులు పి. శ్రీనివాస్, సిబ్బంది గణేష్, పాపేష్, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలపై అవగాహన అవసరం

● ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి



అష్టలక్ష్మి వేషధారాణలతో ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

భైంసా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ పర్వదిన వేడుకలన్నింటిని విశిష్టత,ప్రాధాన్యత,ప్రాశస్తతపై అవగాహన పెంచుకోవాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం భైంసాలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు దీపావళి వేడుకలు, ఉత్తమ విద్యార్థుల పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పర్వదిన వేడుకలను అచార వ్యవహారాలకు అనుగుణంగా సంస్కృతి, సంప్రదాయలు ప్రతిబింబించేలా నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన లక్ష్మీదేవి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.విద్యార్థులతో కలిసి టపాసలు కాల్చారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీలు అష్ట లక్ష్మీ అవతారాలతో అలంకరించుకొని చేపట్టిన ఆధ్యాత్మిక ప్రదర్శనలు అహుతులను విశేషంగా అలరించాయి. చెర్మన్ నరేందర్ రెడ్డి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

జిల్లా ఉపాధ్యాయులకు అవార్డులు



అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు

నిర్మల్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి అబ్దు ల్‌కలాం జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కలాం ఫౌండేషన్, లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ గురువులను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా గులాబ్‌సింగ్ రాథోడ్ (శ్రీవాణి హైస్కూల్), డి.శ్రీకాంత్ (శాంతినికేతన్ హైస్కూల్), పి.ప్రదీప్ (అభ్యాస గురుకులం సోన్), బి.ప్రవీణ్‌కుమార్ (ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్ ముథోల్), డి.నరసింగ (శ్రీవివేకానంద స్కూల్ తానూర్), ఏ.శ్రీనివాస్ (నెహ్రూమోడల్ స్కూల్), జే.నిఖిత (అభ్యాసస్కూల్), ఏ. హరీష్‌రావు (చాణక్యహైస్కూల్), మహమ్మద్ అజ్మత్‌అలీ (మహమ్మదీయ హైస్కూ ల్), కే. శిరీష (ఎస్‌ఆర్ డీజీ హైస్కూల్)లు రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా వ్యవస్థాపకులు సుదర్శన్ ఆచార్య, లక్ష్మణ్, నాయకులు కందల పాపిరెడ్డి, అధ్యక్షులు ఎస్‌ఎన్‌రెడ్డి, సెక్రటరీ అనిల్‌కుమార్, ట్రస్మా నాయకులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా పుల్లూరి ప్రదీప్ కుమార్



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రదీప్‌కుమార్

సోన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అభ్యాస గురుకులంలోని ప్రధానోపాధ్యాయుడికి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా లీడ్‌ఇండియా ఫౌండేషన్ తరపున రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

» భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్

భైంసా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేసేందుకు గాను కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం భైంసాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలోనే సోయా, పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొక్కజొన్న కేంద్రం ఏర్పాటుకు అమోదం లభించిందన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కేంద్రాల ఏర్పాటు,నిర్వాహణ కోసం గాను సన్నద్ధమవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, రైతులకు సమస్యలకు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా సోయా,మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటు విషయమై సమీక్షించారు.మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించారు. దిగుబడుల విక్రయ ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను సకాలంలో పంటల నమోదును పూర్తి చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు.పోరుగు రాష్ట్రాల నుంచి దిగుబడులు ఇక్కడి కొనుగోలు కేంద్రాలకు తరలకుండా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వాటి నిర్వాహణ బాధ్యతలను రవాణ,పోలీసుశాఖ చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాలుచోటు చేసుకోకుండా ఉండేందుకు గాను అగ్నిమాపక శాఖాధికారికి ఆదేశించారు. ప్రాథమిక సహకార సంఘాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నిర్వాహణ వ్యవస్థను పూర్తిస్థాయి పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. మార్కెట్ కమిటీ అధికారులకు సీసీఐపత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు పూర్తి చేసుకోవాలని వెల్లడించారు.ఇందులో భైంసా,కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు సిందే ఆనంద్‌రావ్ పాటిల్, గొనేకర్ కళ్యాణ్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ చరణ్ కుమార్, మిర్జాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ అమెడ దేవేందర్ రెడ్డిలతో పాటు ఆయా ప్రభుత్వ శాఖాధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెస్‌లో జోనల్ స్థాయికి మధుప్రియ


మధుప్రియ

నర్సాపూర్(జి),అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):నర్సాపూర్ (జి) మండల కేంద్రానికిచెందిన మోడెపు సిలారి మధుప్రియ (9వ తరగతి, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల)క్రీడలు, ఇతర విభాగాల్లో తన అద్భుత ప్రతిభతో ఆదర్శంగా నిలుస్తోంది. నిర్మల్‌లో జరిగిన క్రీడాకార్యక్రమాల్లో భాగంగా మధుప్రియ చదరంగం (చెస్) విభాగంలో జిల్లాస్థాయిలో విజయాన్ని సాధించి, ప్రతి ష్టాత్మకమైన జోనల్ స్థాయికి ఎంపికైంది. కాగా మధుప్రి య గతంలోనే రాష్ట్రస్థాయిలో రెండో స్థానం వరకు వెళ్లిం ది. అంతేకాక ఈ బాలిక గతంలో ఎన్‌సీసీ, చదరంగం (చెస్) విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై తన బహుము ఖ ప్రతిభను నిరూపించుకుంది. తనవిజయానికి గల కారణాలను వివరిస్తూ మధు ప్రియ నాతల్లిదండ్రులు మోడెపు సిలారి శేఖర్,కవిత అలాగే ఫిజికల్ డైరెక్టర్, ప్రధానోపాధ్యాయుల ప్రోత్సా హంతోనే ఈ ఘనతలు సాధించగలిగానని సంతోషాన్ని వ్యక్తం చేసింది.

హమ్మయా ఫోన్ దొరికింది !


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న దృశ్యం

ఉట్నూర్,అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలానికి చెందిన కృష్ణవేణి అనే మహిళ పొగొట్టుకున్నరూ.30 వేల విలువ గల సెల్ ఫోన్ తిరిగి లభించడంతో హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది. బుధవారం ఉట్నూర్ నుంచి కరీంనగర్ వెళ్లి జన్నారంకు తిరిగి వస్తున్న ఆర్టీసీ డిపో బస్సులోఎక్కింది. బస్సులోరద్దీ తీవ్రంగా ఉండడంతో ఆమె బస్సు నుంచి దిగిపోతున్న సమయంలో ఆమె సెల్‌ఫోన్ బస్సులోపడిపోయింది. అదే బస్సులో వరంగల్‌కు పనిమీద వెళ్లి తిరిగి కరీంనగర్‌లో ఈబస్సులో ఎక్కిన నుంచి జైనూర్ మండలానికి చెందిన కాంబ్లె అశోక్‌కు దొరికింది. ఒక గంట తర్వాత వారి నుంచి పడిపోయిన ఫోన్‌కు ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసి మీ ఫోన్ నాకు దొరకడం జరిగిందని, మీరు అధైర్య పడవద్దని, జన్నారంలో మీ బంధువులు ఎవరైనా ఉంటే పంపండి, వారికి నేను ఫోన్ అప్ప చెబుతానని అశోక్ చెప్పడంతో సాయంత్రం ఏడుగంటలకు జన్నారం బస్టాండ్‌లో వారి బంధువు సురేష్‌కి ఆర్టీసీ బస్సుడ్రైవర్,కండక్టర్ దయరావు, రమణల ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ అప్పగించిన విషయం తెలుసుకున్న సదరు మహిళ ఊపిరీ పీల్చుకుంది. అశోక్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

గోడ ప్రతుల ఆవిష్కరణ

» ఖానాపూర్‌లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు..
» ఆరు రోజుల పాటు వైభవంగా వేడుకలు


గోడ ప్రతులను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖానాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మావతి నగర్‌లో గల శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 41వ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల ఒకటో తేదీన ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంలు తెలిపారు. ఈ మేరకు గురువారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వచ్చే నెల 1వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు ఈ ఉత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీన స్వామివారి కల్యాణం, 5వ తేదీన జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 6వ తేదీన ఉదయం యజ్ఞపూర్ణాహుతి,సాయంత్రం నాగవెల్లి,ఏకాంతోత్సవ కార్యక్రమాలతో బ్రహ్మోత్స వాల వేడుకలు ముగుస్తాయన్నారు.ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, ఆలయ ప్రధాన అర్చకుడు చక్రపాణి నరసింహా మూర్తి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, యూత్ అధ్యక్షుడు సురేష్, ఆలయ కమిటీ సభ్యులు లింగాల రాము, రామ్ భీమన్న, రమేష్, గౌరీకర్ రాజు, లింగాల లక్ష్మణ్, ఆకుల సురేష్, రాపెల్లి రాజు యాదవ్,సంతోష్, శంకర్, స్వామి, తదితరులున్నారు.

అస్తవ్యస్తంగా ప్రత్యేకాధికారుల పాలన



గ్రామపంచాయతీ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించడం. రూరల్ మండలంలో 31గ్రామ పంచాయతీలు ఉండగా ఏగ్రామంలో చూసినా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో 12 గంటల వరకే ఉంటున్నారని, కొన్ని గ్రామపంచాయతీలలో అయితే రెండు మూడు రోజులకు ఒకసారి మాత్రమే వస్తున్నారని, ఇదేమిటని అడిగిన వాళ్లని గ్రామపంచాయతీలలో ఏ పని కావాలన్నా తమ సహాయం లేనిది ఎలా చేస్తారో చూస్తామని బెదిరిస్తున్నారని, దీంతో ఎవరు కూడా మాట్లాడడానికి భయపడుతున్నా మన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాముదోజువారి కూలీలుగా పని చేస్తామని ఇలా గ్రామపంచాయతీ పనిపై ప్రతిసారి జిల్లా కేంద్రానికి వెళ్లడం అంటే దినసరి కూలీలుగా పనిచేసే తమకు ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పగలు వరకే ప్రత్యేకాధికారులు

జీపీ ప్రత్యేక అధికారులు మధ్యాహ్నం వరకే ఉంటున్న విషయం వాస్తవమేనని, వారికి కంప్యూటర్ ఆపరేటర్లు గ్రామపంచాయతీలలో లేకపోవడంతో వారు ఎంపీడీవో ఆఫీసులోకి వచ్చి ఎక్కడ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లతో పని చేయించుకోవడం వల్ల ఒంటిపుట్టవరకే ఉంటున్నారని, కానీ రెండు మూడు రోజులకు ఒకసారి గ్రామపంచాయతీకి వెళ్తున్నారనే విషయం తమ దృష్టికి రాలే దని, అలాంటి వారిపై ఫిర్యాదులు అందితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో స్వప్నశీల

పోలీస్ ఫ్లాగ్ డేకు ఘనంగా ఏర్పాట్లు

» 21 నుంచి 31 వరకు కార్యక్రమాలు
» విద్యార్థులు, పోలీసులకు వ్యాసరచన పోటీలు


మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

దిలావర్‌పూర్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంరక్షణలో భాగంగా విధినిర్వహణలో ప్రాణా లొదిలిన పోలీస్ అమరవీరులకు ఘనంగానివాళు లు అర్పించేందుకు జిల్లా ఎస్పీడా.జానకి షర్మిల నేతృత్వంలో పోలీస్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్అమరవీరుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరులకు ఘనమైన నివాళులు అర్పించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అక్టోబరు 21 నుంచి పోలీస్ అమర వీరుల దినోత్సవ కార్యక్రమాలు (పోలీస్ ఫ్లాగ్ డే) ప్రారంభం కానున్నాయి.తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో జిల్లా పరిధిలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

21 నుంచి 25వ తేదీ వరకు ఓపెన్ హౌస్

ఈనెల 21నుంచి 25 వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్‌విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు,సాంకేతిక వినియోగం, షీ టీం, భరోసా, సైబర్‌సెక్యూరిటీ,యాంటీనార్కోటిక్‌డ్రగ్,డాగ్‌స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణలో పోలీసులు చేసిన త్యాగాలు మొదలగునవి విషయాలపై విద్యార్థులకు,అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాసరచన పోటీలు

డ్రగ్స్‌నివారణలో పోలీసులపాత్ర..విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలాదూరంగా ఉండాలిఅనే అంశం పై వ్యాసరచన పోటీలను మూడు భాషల్లో తెలుగు, ఇంగ్లీష్,ఉర్దూభాషల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

పోలీసులకునిర్వహించే వ్యాసరచన పోటీలను రెండో కేటగిరీలుగా విభజించారు.మొదటి కేటగిరీ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి అధికారి వరకు 'పనిచేయుప్రదేశంలో లింగవివక్షఅనేఅంశంపై ఎస్సై స్థాయి నుంచిపై స్థాయి అధికారులకు క్షేత్ర స్థాయిలో పోలీసింగ్‌నుబలోపేతం చేయడం'అనే అం శంపై వ్యాసరచన పోటీలు నిర్వహించను న్నట్లు తెలిపారు.

షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు

విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రావర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి గలవారు ఫోటోలు,వీడియోలు ఈనెల 24-10-2025 లోపు జిల్లాపోలీస్ కార్యాలయంలో ఐటీకోర్ ఆఫీస్‌లో అందించాలన్నారు.

పోలీస్ అమరవీరుల బ్యానర్ల ఏర్పాటు

21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పబ్లిక్ స్థలాలలో పోలీస్ అమరవీరుల ఫోటోలతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేస్తామని ఎస్పీ చెప్పారు. అక్టోబరు 21న పోలీస్ ప్రధాన కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద 'పోలీస్ అమరవీరులను' స్మరిస్తూ ఉదయం 8:30 గంటలకు పోలీస్ అధికారులు ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం

» భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న తలమడుగు మండల వ్యవసాయ కార్యాలయం

తలమడుగు,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):దేశానికి అన్నం పెట్టే రైతుకు వెన్నంటి ఉంటూ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న వ్యవసాయ అధికారుల సమస్యలు ఎవరు పట్టించుకోవడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం వారు విధులు నిర్వహించేందుకు కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని ఏక్షణనా కూలుతుందన్న భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలకు వెళ్తే ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో దాదాపు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన మండల వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కులుతుందన్న భయంతో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కార్యాలయం ప్రమాదపుటాంచున ఉండడంతో అధికారులు కార్యాలయానికి రావడానికి భయపడుతున్నారు. ప్రస్తుతం రైతు వేదికలో. ప్రాథ మిక సహకార సంఘం కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కార్యాలయంలో విద్యుత్ సౌకర్యం లేదు. కూర్చోడానికి కుర్చీలు లేవు, ఇతర మౌలిక వసతులు లేవు, పక్కన చెత్త చెదారం ఉండ డంతో దుర్గంధమైన వాసన రావడంతో కార్యా ల యానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించేందుకు సరేనా స్థలం లేక ఇబ్బందులు త ప్పడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల వ్యవసాయ కార్యాలయం తడిసి ముద్దయి ందని, వర్షపు నీరు మొత్తం కారులోనికి వచ్చిందన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నా రు. నూతన భవన మంజూరు కోసం అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి యూబీఈఆర్ కేంద్రంలో నూతన వ్యవసాయ కార్యాలయం మంజూరు చేయగలరని మండల రైతుల కోరుతున్నారు.

సోయా కొనుగోళ్ల కేంద్రం ఏర్పాటు చేయాలి


కుంటాలలో కల్లాల్లో ఆరబెట్టిన సోయా

కుంటాల,అక్టోబరు, 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పంటను పండించడం ఒక ఎత్తయితే..పండించిన పంట ను విక్రయించు కోవడం మరో సవాల్‌గా మారింది. ఇందుకు నిదర్శనం ప్రస్తుతం కోతకోసి అమ్ముకునేందుకు సిద్ధంగా ఉన్న సోయాపంట అసలే అంతంత మాత్రం దిగుబడి రావడం, దానికి తోడు దళారులు ఇష్టారీతిన కొనుగోలు చేయడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే సోయా పంట కోత కోసి వారం పది రోజులు గడుస్తున్నప్పటికి కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులకు ఎంతో కొంతకు అమ్ము కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలే ఈ ఏడాది అధిక వర్షాల వల్ల సోయా పంట దిగుబడి సైతం రాలేదు. దీంతో అటు దిగుబడి లేక, ఇటు ధర రాక అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. కుంటాల మండలంలో దాదాపు 4 వేల ఎకరాల్లో రైతులు సోయా పంటను సాగు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం మద్దతు ధర 5360 ప్రకటించింది. కాని దళారులు మాత్రం రైతులను నిండా ముంచుతున్నారు. గ్రామాలలో 3500ల నుంచి 4000 వేల వరకు మాత్రమే చెల్లించి సోయా పంట కొనుగోళ్లు చేపడుతున్నారు. దీంతో నష్టాల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ఏ ర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తే తమకు లాభం చేకూరుతుందని రైతులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుంటుంది



అసలే ఈఏడాది సోయా పంట దిగుబడి సరిగా రాలేదు. దీనికి తోడు సీజన్ ప్రారంభంలో రెండు సార్లు విత్తనాలు విత్తు కోవాల్సి వచ్చింది. ప్రస్తుతం దిగుబడి సరిగా రాలేదు.ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొను గోలు చేస్తే బాగుంటుంది.

-శీలం అశోక్, వెంకూర్, రైతు)

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో జరిగిన ఎన్‌సిసి సాంస్కృతిక కార్యక్రమానికి కలెక్టర్ రా/ర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కిచర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎన్‌సిసి కేడెట్లు 10 రోజుల శిక్షణ శిబిరంలో భాగంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిసి అధికారులు, శిక్షకులు, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నిర్మల్‌రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మామడ వైపు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మంజులాపూర్ వద్ద పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

బాసర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని హాజినికి చెందిన మాధవి (23) కర్మానే మనోజ్ అనే ఇద్దరు పెద్దల సమక్షంలో నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త మనోజ్ మద్యానికి బానిసై, తరచూ ఇంటికి మద్యం తాగి వచ్చి మాధవిని మానసికంగా, శారీరకంగా వేధించేవాడని, ఈ వేధింపులు తాళలేక మాధవి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. బాసర పోలీసులు కేసు నమోదు చేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దర్యాప్తు కొనసాగుతోందని బాసర పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిగా వ్యవహరిస్తూ కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చేలా చూస్తానని డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. హైకోర్టులో జడ్జీలు, న్యాయవాదులు పరిచయం ఉన్నారని నమ్మబలికి బాధితుల నుంచి రూ.3 లక్షల 50వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం సమాచారం

ఒకే రోజు ఇద్దరు మహిళల మృతి

» వడగామ్ గ్రామంలో విషాదచాయలు » వాయిదా పడ్డ భోగి పూజలు


లచ్చుబాయి(ఫైల్)


సీడాం జారుబాయి (ఫైల్)

ఇంద్రవెల్లి,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):ఒకే రోజు ఇద్దరు మహిళలుమృతి చెందిన ఘటన గురువారం మండలంలోని వడగామ్ గ్రామంలోజరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం ఆత్రం లచ్చుబాయి (60) ఇంటి పనులు చేస్తూ ఆకస్మాత్తుగా స్పృహ కోల్పోయి అక్కడికక్కడే మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన సీడాం జారుబాయి (25) వారంరోజులుగా స్వల్ప జ్వరంతో బాధపడటంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా ఆరోగ్యం కొంత కుదుట పడింది. గురువారం ఉదయం చేతి పంపు నుంచి నీళ్ల తీసుకొచ్చి ఇంటి ముందు అలుకు వేస్తుండగా కడుపులో మంట ఉందని ఆకస్మాతుగా మంచంపై పడింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆటో సాయంతో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఇద్దరు మహిళలు ఒకే సమయంలో మృతి చెందడంతో వడగామ్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఇద్దరు మహిళలు ఒకే రోజు మృతి చెందడంతో గురువారం గ్రామంలో నిర్వహించాల్సిన భోగి పూజలను గ్రామస్థులు వాయిదా వేసినట్లు తెలిపారు. కాగా మృతురాలు ఆత్రం లచ్చుబాయికి భర్త బాదు, ఇద్దరు కొడుకులున్నారు. సిడాం జారుబాయికి భర్త దేవిదాస్‌లు ఉన్నారని తెలిపారు.

భార్యను చంపిన భర్త

గుడిహత్నూర్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో భార్యపైదాడి చేసి భర్త హత్య చేసిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం సీతాగొంది గ్రామానికి చెందిన సీడం సంతోష్ మద్యానికి బానిసైఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు. తరుచూ భార్య లక్ష్మీబాయి(35)తో గొడవపడేవాడు. గురువారం ఉదయం మద్యంతాగి ఇంటికివచ్చాడు. తాగి మోటార్ సైకిల్ నడపొద్దని మందలించడంతో భార్యతో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో కోపంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమెపై దాడి చేయగా లక్ష్మీబాయి అక్కడికక్కడే మృతి చెందింది సంతోష్ గుడిహత్నూర్ వచ్చి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి అక్క కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

నేరడిగొండ,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుద్దికొండ గ్రామ సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక రైతు నవీన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో సుమారు 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు.నేరడిగొండ ఎస్సైఇమ్రాన్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామస్థులు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొ ని మృతదేహాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు.మృతుడికి సంబంధిం చి వివరాలు తెలిసినవారు ఉంటేసెల్: 8712659947 సమాచారం అందించాలని కోరారు.

గుండె పోటుతో వ్యక్తి కన్నుమూత

నార్నూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాక్స్ రిటైర్డ్ ఉద్యోగి, మాతంగ్ ఋషి సంస్కార్ కేంద్రం వ్యవస్థాపకలు అధ్యక్షుడు పండరి సూర్యవంశీ గుండె పోటుతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలి పారు. విషయం తెలుసుకున్న దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు భౌతికాయని శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు సర్వం చ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్, నర్సింగ్ మోరె, ప్రగాఢ సానుభుతి తెలి పారు. వారి వెంట నాయకులు దేవరావు లోకండే, సంతోష్ మనే, కాంతరావు దుర్గే, రమేష్ రాథోడ్, ఉత్తంరాథోడ్, కోరెల మహేందర్, మహిళా నాయకురాలు ఉన్నారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి


పొలాలను పరిశీలిస్తున్న అంజిప్రసాద్,తదితరులు

నిర్మల్‌రూరల్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాంశ గ్రామంలో నానో యూరియా పిచికారీ చేసిన వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ సందర్శించినట్లు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 500ల ఎంఎల్ నానో యూరియా బాటిల్ ఒక 45 కిలోల యూరియా బస్తాకి సమానమని, పనిచేసే సామ ర్థ్యం కూడా నానో యూరియాకు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా చాలా సులువుగా చాలా రకాల పురుగు మందులు, నానో డీఏపీ, నానో యూరియాతో కలిపి పిచికారీ చేసుకోవచ్చని తెలియజేశారు. రైతులు 30 రోజుల తర్వాత నానో యూరియాను వాడుకోవచ్చని, డ్రోన్‌ల ద్వారా కాని చేతి పంపుల ద్వారా కాని పిచికారీ చేసుకో వచ్చన్నారు. ధర కూడా యూరియా బస్తా కంటే తక్కువగానే ఉం టుందన్నారు. ఖర్చు కూడా ఆదా అవుతుం దని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల్లో పెద్ద ఎత్తున నానో యూరియా వాడకం చేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధనుంజయ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నరేష్ రెడ్డి, రాజేశ్వర్, నరేష్ పాల్గొన్నారు.



పెన్షనరీ బెనిఫిట్స్ కోసం ప్రభుత్వానికి నివేదన

నిర్మల్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పెన్షనరీ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరింది. జిల్లా పక్షాన గురువారం కలెక్టర్‌ని కలిశారు. పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లింపు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, ఆర్థికశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించేందుకు విజ్ఞాపకపత్రాన్ని కలెక్టర్ ద్వారా సమర్పించామని జాతీయకార్యదర్శి, జిల్లా పెన్షన్ల సంఘ జిల్లా అధ్యక్షు డు ఎంసీ లింగన్న తెలిపారు. కార్యక్రమంలో గంగన్న, పోతారెడ్డి, కే.రమేష్, జనార్ధన్, బి.కిషన్ రావు, పోతన్న, పోశెట్టి, వేణుగోపాల్, కే.రాములు, జాపరాములు, లక్ష్మణ్, ఎం.రాజేశ్వర్ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో మావోయిస్టు ఉద్యమ ప్రస్థానం ముగిసినట్లయింది. 1980 నుంచి మొదలుకొని ఐదారేళ్ల క్రితం వరకు జిల్లాలో నక్సలైట్ల కార్యకలాపాలు పెద్ద ఎత్తున కొనసాగేవి. అయితే జిల్లాకు చెందిన చాలా మంది నేతలు పోలీసులకు సరెండర్ కావడంతో ఉద్యమానికి దిశా నిర్దేశం కరువైంది. మొట్ట మొదట అప్పటి రాష్ట్ర కమిటీ మెంబర్‌గా వ్యవహరించిన నయనగారి రవి ఆలియాస్ మురళి, దళ కమాండర్ అజయ్, సెంట్రల్ కమిటీ మెంబర్, పొలిట్‌బ్యూరో సభ్యుడు, జార్ఖండ్ రాష్ట్ర ఇంచార్జీ సట్వాజీ ఆలియాస్ సుధాకర్‌తో పాటు రెండు రోజుల క్రితం మావోయిస్టు పార్టీ టెక్నికల్ విభాగం చీఫ్ ఇర్వి మోహన్ రెడ్డి ఆలియాస్ విక్రమ్ ఆలియాస్ భూపతి పోలీసులకు లొంగిపోవడంతో ఉద్యమానికి తెరపడిందని అంటున్నారు. లక్ష్మణచాంద మండలం కూచన్‌పల్లికి చెందిన ఇర్వి మోహన్ రెడ్డి ఆయన భార్య సరోజన లొంగిపోవడంతో ఇక అన్నల మాట గతమనే చెప్పాలి.





మావోయిజం ఖాళీ..

- మోహన్ రెడ్డి లొంగుబాటుతో జిల్లాలో ముగిసిన అన్నల ప్రస్థానం
- గత పదేళ్ల నుంచి తగ్గిన కార్యకలాపాలు
- పోలీసుల నిర్బంధంతో కకావికలం

నిర్మల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జిల్లాలోని మారుమూల అటవీ గ్రామాలు అన్నలకు ఇలాకాలుగా ఉండేవి. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్, మామడ, నిర్మల్, సారంగాపూర్ మండలాల్లో పీపుల్స్‌వార్ పార్టీ కార్యకలాపాలు ముమ్మరంగా జరిగాయి. వందలాది మంది యువకులు అప్పట్లో ఉద్యమబాట పట్టారు. చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లి వరుస ఎన్‌కౌంటర్‌లకు సైతం గురయ్యారు. అప్పట్లో ఏ ఊర్లో చూసిన అన్నల అలికిడి కనిపించేది. ఊరూరా అన్నలు తమ కార్యకలాపాలను కొనసాగించేవారు. ఒక సామాజిక ఉద్యమం వీరి ద్వారా ఉవ్వెత్తుల ఎగిసింది.

ఉద్యమం... ఇక గతమే..

ఊళ్లల్లో యేళ్ల నుంచి పరిష్కారం కాని భూములు ఇతర సమస్యల పరిష్కారం అన్నలతో సాధ్యమయ్యేది. ఓ దశలో నిర్మల్ జిల్లాలో వీరు సమాంతర వ్యవస్థను నడిపారు. వారు చెప్పిదే వేదంగా కొనసాగింది. అప్పటి పీపుల్స్ వార్ నేతలు గ్రామాల్లో గ్రామ రాజ్య కమిటీలు ఏర్పాటు చేసి భూమి లేని వారికి భూ స్వాముల నుంచి భూములు లాక్కొని అప్పగించేవారు. దున్నేవాడిదే భూమి అంటూ నినదించి ప్రతి పల్లెలో పేద దళితులు, గిరిజనులకు వ్యవసాయం పేరిట ఉపాధి కల్పించేవారు. ఇలా అప్పటి పీపుల్స్‌వార్ ఉద్యమాన్ని నడిపిన చాలా మంది ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందగా మరికొంతమంది పోలీసులకు లొంగిపోయారు. పీపుల్స్ వార్ ఎంసీసీ పార్టీతో విలీనమై మావోయిస్టు పార్టీగా ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో ఆ పార్టీ కార్యకలాపాలు తగ్గుముఖం పడుతూ వచ్చాయి. ముఖ్యంగా పోలీసుల ఇన్‌ఫార్మింగ్ వ్యవస్థ, కోవర్టు ఆపరేషన్‌లు పీపుల్స్ వార్ ఉద్యమాన్ని దెబ్బకొట్టాయి.

అనుబంధ సంఘాలు సైతం..

అప్పటి పీపుల్స్ వార్ పార్టీకి తన అనుబంధ సంఘాలు అత్యంత కీలక పాత్ర పోషించాయి. పీపుల్స్ వార్ పార్టీలో చేరికల నుంచి మొదలుకొని ఆ పార్టీ కార్యకలాపాల నిర్వహణ, శత్రువును వెంటాడడం లాంటి అనేక వ్యవహారాలకు అనుబంధ సంఘాలు ఊతమిచ్చాయి. విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున పీపుల్స్ వార్‌లోకి రిక్రూట్‌మెంట్‌ల కోసం ఏర్పాటు చేసిన రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఉద్యమ చరిత్రలోనే అత్యంత కీలక పాత్ర పోషించింది. అప్పట్లో ఆర్‌ఎస్‌యూ పీపుల్స్ వార్‌కు ప్రధాన నియామక వ్యవస్థగా తోడ్పడింది. వందలాది మంది ఆర్‌ఎస్‌యూ విద్యార్థులు అడవి బాట రాడికల్ యూత్ లీగ్, ప్రజా నాట్య మండలి, రైతు కూలీ సంఘం, ఆదివాసీ విముక్తి మోర్చ లాంటి సంస్థలన్ని పీపుల్స్ వార్‌కు వెన్నుదన్నుగా నిలిచి ఆ పార్టీ సమిష్టతకు దోహదపడ్డాయి. ఇలా అనుబంధ సంఘాల ద్వారా జిల్లాలోని చాలా మంది పీపుల్స్‌వార్ పార్టీలో చేరారు.



గతంలో లొంగిపోయిన మురళి, సుజాత

చరిత్ర ముగిసినట్లే...

జిల్లాలో అజ్ఞాతంలో ఉంటూనే సమాంతర వ్యవస్థను నడిపిన అప్పటి పీపుల్స్ వార్ ప్రస్తుత మావోయిస్టు పార్టీ ఉనికి ఇక జిల్లాలో ముగిసినట్లేనని అంటున్నారు. నాలుగైదు సంవత్సరాల క్రితం వరకు జోరుగా కార్యకలాపాలు సాగించిన ఆ పార్టీ వరుస ఎన్‌కౌంటర్‌లు, లొంగుబాట్ల కారణంగా బలహీన పడుతూ వచ్చింది. పోలీసులు పెద్ద ఎత్తున ఇన్‌ఫార్మర్ వ్యవస్థను, కోవర్టు ఆపరేషన్‌లను చేపడుతూ ఆ పార్టీ కార్యకలాపాలను నిరోధించగలిగారు. మొన్నటి వరకు కొద్ది మంది రాష్ట్ర సెంట్రల్ కమిటీల్లో కొనసాగినప్పటికి వారు కూడా పోలీసులకు లొంగిపోయిన కారణంగా ఇక ఆ ఉద్యమ ప్రస్థానం చరిత్ర పుటలకే పరిమితం కానుందని అంటున్నారు.

జిల్లాలో భారీ సంఘటనలు...

అప్పటి పీపుల్స్ వార్ హయాంలో జిల్లాలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. నిర్మల్ పట్టణంలో అప్పటి డీసీసీబీ అధ్యక్షుడు రమేష్ రెడ్డిని ఆయన ఇంట్లోనే తుపాకులతో కాల్చి చంపారు. అలాగే 15 మందికి పైగా పోలీసు ఇన్‌ఫార్మర్‌లను హతమార్చారు. దీంతో పాటు అల్లంపెల్లి సంఘటన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలకలం సృష్టించింది. ఇక్కడి పీపుల్స్ వార్ నక్సలైట్ల కాల్పుల్లో పెద్ద సంఖ్యలో పోలీసులు హతమయ్యారు. పోలీసులు ప్రయాణిస్తున్న జీపును సింగాపూర్ అడవుల్లో పేల్చేశారు. నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను సైతం పేల్చి కలకలం రేపారు. ప్రజా కోర్టులు నిర్వహించి గిరిజనుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌లకు ప్రజల సమక్షంలోనే శిక్షలు విధించారు. ఇలా అనేక సంఘటనలతో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ జిల్లాలో పెద్ద ఎత్తున అజ్ఞాత కార్యక్రమాలు నిర్వహించి సర్కారుకు సవాలు విసిరింది.

పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- అంగన్‌వాడీ పిల్లలను తమ బిడ్డలుగా చూసుకోవాలి : కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోషణమాసం ముగింపు వేడుకలు గురువారం పట్టణంలోని దివ్యగార్డెన్స్‌లో జరిగాయి. మాతా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పిల్లల్లో పోషకాహర లోపాన్ని నివారించేందుకు చేపట్టిన పోషణ మాసం కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. ఇది ఒక్క నెల కార్యక్రమంగా కాకుండా ప్రజల్లో నిరంతరం పోషకాహర ప్రాముఖ్యతపై అవగాహన పెంచేలా చర్యలు కొనసాగించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పోషకాహారం అందుతోందని భరోసా కల్పించాలన్నారు. ప్రతిచిన్నారి అంగన్‌వాడీలో చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గతనెల 17వ తేదీ నుంచి నేటి వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహర లోపాల నివారణపై విస్తృత అవగాహన కల్పించామన్నారు. జిల్లాలోని 931 అంగన్‌వాడీల్లో ప్రతి రోజు పోషక విలువలతో కూడిన సంపూర్ణ ఆహారం అందిస్తోందని, వైద్యారోగ్య శాఖ సహకారంతో గర్భిణులు, చిన్నారుల్లో పోషకాహర లోపాన్ని నిర్మూలించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను తమ సొంత బిడ్డలుగా చూసుకోవాలని,



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

బాల్యంలో పోషకాహర లోపం అధిగమిస్తే భవిష్యత్తులో పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగి, దేశ నిర్మాణానికి తోడ్పడతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందిని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... జిల్లాలోని అంగన్‌వాడీల్లో వంద శాతం పిల్లలకు పోషకాహారం అందుతోందని, శాఖకు సంబంధించిన సూచికల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. భవిష్యత్తులో అన్ని సూచికల్లో మెరుగైన స్థానాన్ని నిలబెట్టేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారంపై నాటికలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. గర్భిణులకు పండు, సారెలు పంపిణీ చేసి సామూహిక సీమంతం నిర్వహించగా, చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు పోషకాహర స్టాళ్లను పరిశీలించి, టీచర్ల సృజనాత్మకతను ప్రశంసించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సీడీపీవోలు, సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు పాల్గొన్నారు.

'ఎల్టా' కమిటీ సభ్యుల జాబితా ప్రకటన



ఏర్పాటైన కొత్త కమిటీ సభ్యులు

నిర్మల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎల్టా కమిటీ కొత్త సభ్యుల జాబితాను సంస్థ నాయకులు ప్రకటించారు. విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థుల ప్రగతిని దృష్టిలో ఉంచుకొని కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ స్థాపక అధ్యక్షుడిగా కాదర్ల రవీంద్ర కొనసాగుతుండగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.భూమన్న యాదవ్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా లక్ష్మీపతి నియమితులయ్యారు. కే.వెంకటేశ్వరరావు అధ్యక్షుడిగా, అల్లూరి రామ్మోహన్ జనరల్ సెక్రటరీగా, ఎం.చంద్రశేఖర్ రావు గౌరవ అధ్యక్షుడిగా, కే.రత్నాకర్‌కుమార్ ఖజాంచీగా, అలాగే మంత్రి ప్రకాష్ (ఖానాపూర్) అసోసియేట్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా గంగామోహన్, కేఆర్.సునీల్‌రెడ్డి, బి.కిరణ్‌కుమార్, గంగాకిషన్, రాజేశ్వర్ రెడ్డి, ఎస్. గణపతి నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నవీన్ గౌడ్, ఎస్. గంగాధర్, తిరుమల్ రెడ్డి, బి. ముత్తన్న, రాహుల్, ఎర్రన్న, చంద్రశేఖర్ రెడ్డి, చిన్ని రెడ్డి, రాజేశ్వర్ ఎంపికయ్యారు. లేడీ సెక్రటరీలుగా కే. సంధ్యారాణి, ఎంవీ. లక్ష్మీ, గీతా రామ్‌చందర్ (కేజీబీవీ), స్వాతి, విక్రాంతి, శైలజ బాధ్యతలు స్వీకరించారు. సెక్రటరీలుగా రవిరాజ్, ఎస్. పౌల్, బి. శ్రీనివాస్ రావు, ఇర్ఫాన్ షేక్, సి. గోవిందరావు, దేవన్న నియమితులయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాస్ (భైంసా), శ్రీపాద్, నరేందర్ కుమార్, సయ్యన్న, జాకీర్, ధర్మపురి ఎంపికయ్యారు. అడ్వైజర్లుగా డి. హరినాథ్ రావు, వివేక్, చంద్రశేఖర్ వర్మ, పండరి, శ్రీనివాస్ రావు (ఐటీడీఏ), నాందేవ్ (ఐటీడీఏ), సంజయ్ ప్రతాప్ ఉన్నారు. మీడియా ఇన్‌చార్జీలుగా జేవీ. రామన్న, దత్తాత్రి, లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వర్షాకాలం వరద నీరునిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డితో కలిసి వర్షాకాలం పట్టణంలోని వరద నీరు నిల్వ ఉండకుండా చేపట్టవలసిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో భవిష్యత్తులో వరద నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాకాలానికి మునుపే నాళాల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారం తొలగించినట్లు తెలిపారు. అవసరమైన చోట డ్రైనేజీల మరమ్మతులు చేపడతామన్నారు. వరద నీటి నియంత్రణకు అవసరమైతే నూతన నిర్మాణాలు చేపడతామన్నారు. పట్టణంలో వర్షం నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ఇక ముందు వర్షపు నీరు ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసి, వరద నీరు చేరి, నిల్వ ఉండటం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగ్గా నిర్వహించాలని తెలిపారు. వరద నీటి నిల్వ నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇరిగేషన్ ఇంజనీరింగ్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్

నిర్మల్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలపై వివిధ శాఖల అధికారులతో కలిసి బ్యాంకర్లు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొద్ది రోజులుగా బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న ఉపసంహరించుకొని నిధుల వివరాలను గుర్తించి వారి సంబంధికులకు బ్యాంకు నియమాలు పాటిస్తూ ఆ నగదును అందించాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించే రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల బ్యాంకు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని, వారు విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఇప్పటి వరకు ప్రజలకు బ్యాంకుల ద్వారా అందజేసిన రుణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులకు వచ్చే ప్రజలందరికీ మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోటపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, ఎస్‌బీఐ ఆర్ఎం రామచంద్ర రావు, జిల్లా అధికారులు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మాణ అనుమతులు లభించిన ఇళ్లపనులు ఆలస్యం కాకుండా దశల వారీగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకా ప్రారంభం కాని పనులు తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్, విద్యా, పంచాయతీ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థినితో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న

నిర్మల్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్ల(కే) ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు పరిశీలించారు. విద్యార్థులలో తొలిమెట్టు సామర్థ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.లత, షహీదా పర్వీన్, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా రైతులు స్వయం సమృద్ధిని సాధించడం హర్షణీయం

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి

నిర్మల్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా రైతులు సేంద్రియ ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించడం సంతోషకరమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో, నిర్మల్‌మండల సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యశ్రీ మహిళా ఉత్పత్తిదారుల సంస్థ రూపొందించిన సూక్ష్మ హరిత ఆహారం తయారీ, మార్కెటింగ్ కార్యక్రమం అభినందనీయంగా సాగుతోంది. సుమారు 1500ల మంది మహిళా రైతుల సభ్యత్వంతో ఉన్న ఈ ధాన్యశ్రీ సంస్థ, మహిళా రైతులను వ్యాపారవేత్తలుగా ఎదిగే దిశగా ప్రోత్సహిస్తోంది. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఉదయపు నడకలో వాలా సభ్యులకు సూక్ష్మ హరిత ఆహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. మైక్రోగ్రీన్స్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని డీఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో వాలాసభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీనేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కనీసమద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, తక్కల రమణారెడ్డి, సత్యం చంద్రకాంత్, విలాస్, ఒడిసెల అర్జున్, సాగర్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు అరవింద్, దినేష్, గిల్లివిజయ్, సాత్విక్, నరేష్ పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : పట్టణంలోని దివ్యనగర్‌లో రూ. 5 లక్షల నిధులతో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులున్నారు.



మున్నూరుకాపు సంఘభవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

భవననిర్మాణ పనులకు భూమిపూజ...

జిల్లా కేంద్రంలో రూ.5 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో గౌడ్ అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ భవన నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, తక్కల రమణారెడ్డి, సత్యం చంద్రకాంత్, కరిపే విలాస్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు అరవింద్, భూపతిరెడ్డి, అర్జున్, దినేష్ పాల్గొన్నారు.